క్లుప్తంగా

విద్యార్థులకు హాట్ బాక్స్‌ల పంపిణీ



బాక్సులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

మల్కాపురం: చదువుతో ప్రగతి సాధ్యం..ఉన్నత చదువు మన ఉజ్వల భవితకు బాసటగా నిలుస్తాయని కోరమాండల్ సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కె.వి.వి.వై.ఎస్.నారాయణ అన్నారు. తన సొంత నిధులతో 58వ వార్డు పిలకవానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం హాట్‌బాక్సులు పంపిణీ చేశారు. ఆయన తల్లి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయించారు.ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ములగాడ, పిలకవానిపాలెం గ్రామాలపెద్దలు ధర్మాల వేణుగోపాల రెడ్డి, చుక్క కనకరెడ్డి,సత్యనారాయణరెడ్డి,పిలక రమణ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి



ఏడీసీ రమణమూర్తికి వినతి అందజేస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం జీవీఎంసీ కార్యాలయంలో ఏడీసీ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. మరుగుదొడ్లు,మంచినీటి సదుపాయం డ్రైనేజ్ సదుపాయం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అధికారులు స్పందించి జోన్-5 జెడ్సీని ఆ ప్రాంతానికి పంపించిసమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు వ్యాపారులు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భెల్ సీఐటీయూ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న 5వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించడం దారుణమని భెల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి. ప్రకాష్ అన్నారు. ఆ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న పోరాట పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యవర్గ సభ్యుడు జగన్నాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలను కార్మికవర్గం, ప్రజానీకం ఖండించాలని కోరారు. అన్యాయం జరిగిన కార్మికుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.నారపరెడ్డి, పి.కనకారావు, ఆర్. జనార్ధనరావు, జి.అచ్చన్ననాయుడు, పి.శివరాం, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తూ రాత్రి వేళల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఆదివారం అర్ధరాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టీటీఈ రెస్ట్ హౌస్, బుకింగ్ కార్యాలయంతోపాటు హెరిటేజ్ రిటైరింగ్ రూంలు, స్లీపింగ్ పాడ్స్ వంటి ప్రాంతాల్లో సిబ్బంది వసతులు, ప్రమాణాలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో సిబ్బందితో డీఆర్‌ఎం ముఖాముఖి మాట్లాడారు. ఏ సమస్యలున్నా తనకు తెలియజేయాలని, అవసరమైన సూచనలు చేయవచ్చన్నారు. ఆకస్మిక తనిఖీల వల్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని డీఆర్‌ఎం తెలిపారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణ.. ప్రాణాలకు రక్షణ

● వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

● మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపరాదు
● ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..
● హెల్మెట్ బెల్ట్ క్లిప్పు పెట్టుకోవాలని సూచన



పిల్లలను ఎన్నో ఆశలతో...ప్రేమతో పెంచుతాం... కావాల్సినవన్నీ కొనిపెడతాం.. అయితే వాటిని వారు ఎలా ఉపయోగిస్తున్నారో చూడం.. అదే వారికి రక్షణ లేకుండా చేస్తుంది. తీరని దుఃఖాన్ని మిగులుస్తుంది. అలాంటి కోవకే చెందుతుంది హెల్మెట్ లేని ప్రయాణం. చాలా కుటుంబాల్లో తీర్చలేని బాధను మిగులుస్తోంది.ఆశలను సమాధి చేస్తుంది.వాటిని దృష్టిలో పెట్టుకుని హెల్మెట్ ఆవశ్యతపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలకు రేసింగ్ బైక్‌లు ఇవ్వవద్దని సూచిస్తున్నారు.

– గోపాలపట్నం



హెల్మెట్ లేక పోవడం వల్ల గోపాలపట్నంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యువకుడు(ఫైల్)



హెల్మెట్ క్లిప్పు పెట్టు కోవడంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ లేక పోవడం వల్ల మృత్యువాత పడుతున్నారని పలు నివేదికలు.. ప్రమాద ఘటనలు చెబుతున్నాయి. చాలా మంది కళ్లారా చూసినా హెల్మెట్ వాడేందుకు ఆసక్తి చూపడం లేదు. సుప్రీం కోర్టు సైతం హెల్మెట్ ధరించాలని లేని పక్షంలో వారికి జరిమానాలు విధించడం ...లైసెన్స్‌రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచిస్తోంది.

మార్పు అనివార్యం

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పలు చర్యల్లో భాగంగా మృతుల సంఖ్యతగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్రాఫిక్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టమే కాకుండా వాహన చోదకుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ వివరిస్తున్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వానాలను నడపరాదని.. జిగ్‌జాగ్‌లా నడపడం వల్ల ఇతర వాహనదారులు ఇబ్బంది పడి ప్రమాదాల బారిన పడతారని సూచిస్తున్నారు. ఈ విధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



ఎన్‌ఏడీ జంక్షన్ దిగవ సర్కిల్‌లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ దాశరథి

క్లిప్పులు పెట్టండి

కొంతమంది హెల్మెట్ పెట్టినా ఉన్నబెల్ట్ క్లిప్పులు పెట్టరు. దీంతో ప్రమాదం జరిగినప్పుడు రక్షణ లేకుండా పోతుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే హెల్మెట్ తలనుంచి ఎగిరి పడకుండా రక్షణగా నిలబడేందుకు ఆ బెల్టు ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు. హెల్మెట్ విషయంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వాహనాలు నడిపే వారికి జాగ్రత్తలు చెప్పాలని ట్రాఫిక్ అధికారులు కోరుతున్నారు.

కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకోండి



వాహనం నడిపేటప్పుడు మీ కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకోండి. వారి కోసమైనా హెల్మెట్ వాడండి. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో తెలియదు. మనల్ని మనం కాపాడుకునేందుకు ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడాలి. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు. ద్విచక్రవాహనంపై ఇద్దరు కూడా హెల్మెట్లు వాడాలి. అపోహలు వీడండి. జుట్టు ఊడడం వంటివి జరగవు. రక్షణ కోసం అందరూ హెల్మెట్ వాడాలి.

–దాశరథి, ట్రాఫిక్ సీఐ, కంచరపాలెం

ములగాడ మార్గానికి మోక్షం కల్పించండి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్ మీదుగా మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గానికి మోక్షం కల్పించాలని నగర మేయర్ పీలా శ్రీనివాస్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు.పీజీఆర్‌లో సోమవారం మేయర్‌ను జగ్గునాయుడు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. డాక్‌యార్డ్ వద్ద గల సర్దార్ వల్లబాయి పటేల్ వంతెన మూసి వేయడంతో పారిశ్రామిక ప్రాంత వాసులు ములగాడ సేవా మార్గం ద్వారా నగరానికి చేరుకోవాల్సి వస్తుందని వివరించారు. అయితే ఆ మార్గం పూర్తిగా గోతుల మయం,ధూళితో నిండి ఉందని తెలిపారు.ఈ కారణంగా పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. సమస్యను పోర్టు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

డస్ట్‌బిన్‌లో కోళ్ల వ్యర్థాలు



డస్ట్‌బిన్‌లో చికెన్ వ్యర్థాలు

ఫోకస్

జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని చికెన్ వ్యాపారుల తీరుతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దుకాణాల్లోని కోళ్ల వ్యర్థాలను సేవా మార్గంలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలో నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు.దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా ఈ సమస్య త్రినాథపురం,ఏఎస్‌ఆర్‌కాలనీ ప్రాంతాల్లో ఉన్నా వార్డు శానిటరీ అధికారులు స్పందించడం లేదని స్థానిక వాసులు ఆరోపిస్తున్నారు. చికెన్ వ్యర్థాల నుంచి వచ్చే చెడు వాసన వల్ల ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

తల్లిపాలు బిడ్డకు అమృతతుల్యం



కార్యక్రమంలో పాల్గొన్న బాలింతలు, నర్సింగ్ విద్యార్థులు

గోపాలపట్నం: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు సాయిప్రసాద్ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీ సచివాలయంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లి పాల వల్ల పిల్లలకు కలిగే లాభాల గురించి వివరించారు. తల్లి పాలు పిల్లలకు అమృతంలా పని చేస్తాయని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ. దేవి, టి. శాంతి, బి. గాయత్రి, ఆర్. చంద్రకళ, కె. సంతోషి, బెహరా నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని 11 కేవీ జవహర్‌నగర్ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్ -2 ఈఈ బి.కె.నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ స్ట్రీట్ ఏరియా, హరిహర క్షేత్రం ఏరియా, నెహ్రూనగర్,ఎంఐజీ,లేబర్ జంక్షన్, హనుమాన్‌సంజీవ్‌కాలనీ ప్రాంతాలకు బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వివరించారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 06, ఇంజినీరింగ్‌కు 05, రెవెన్యూకు 01, పబ్లిక్ హెల్త్‌కు 01 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, వాటర్ ఏఈ సుమన్, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, జనార్దనరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు పెట్టి భారాలు మోపవద్దు



నినాదాలు చేస్తున్న కార్మికులు

మల్కాపురం: అదానీ స్మార్టు మీటర్లు ఇళ్లకు బిగించి నమ్మి ఓట్లు వేసిన ప్రజలపై ఆర్థిక భారం మోపవద్దు అని వీడీఆర్ గొడౌన్స్ కార్మికుల సంఘం అధ్యక్షుడు పైడిరాజు అన్నారు.స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం గొడౌన్స్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపారు.ఆయన మాట్లాడుతూ స్మార్టు మీటర్ల వల్ల ప్రజలపై మోయలేని భారంపడుతుందన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సతమతం అవుతున్న ప్రజలకు మరలా అదనపు భారాలు వద్దు అని డిమాండ్ చేశారు. గడిచిన ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని నమ్మబలికిన కూటమి నాయకులు నేడు చార్జీలు పెంచడం దారుణమన్నారు. స్మార్టు మీటర్ల అంశాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా బస్సుల హాల్ట్‌లను కుదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్

గాజువాక: ఫార్మా బస్సుల వల్ల గాజువాకలో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయని ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫార్మా బస్సుల యజమానులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులను ఎక్కించుకోవడం కోసం బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారన్నారు. దీనివల్ల జనం ఇబ్బంది పడుతున్నారన్నారు. బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్సులు నిలిపే హాల్ట్‌లను తగ్గించుకోవాలన్నారు. పార్కింగ్ లేనిచోట బస్సులు ఆపితే చర్యలు తీసుకుంటామన్నారు. షిఫ్టల సమయాలను కూడా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. బస్సులన్నీ ఒకేసారి రాకపోకలు సాగించడం వల్ల రోడ్డుపై మిగిలిన వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. ఒక్కో బస్సుకు కొంత గ్యాప్ ఉండే విధంగా షిఫ్టలను మార్చుకొని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సహకరించాలన్నారు. సమావేశంలో గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు



కార్యక్రమంలో వీసీ ఆచార్య రాజశేఖర్ తదితరులు

మద్దిలపాలెం : పోటీ ప్రపంచంలో విజేతగా మారాలంటే విద్యా సంబంధిత అంశాల్లో రాజీ పడొద్దని... ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్‌లో పరిశోధన రంగంలో రాణించే దిశగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేకంగా యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు నాలుగేళ్ల తర్వాత తాము పొందాలనుకునే భవిష్యత్ కోసం ప్రణాళిక తయారు చేసుకుని నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నూతన కరికులం తయారుచేసి అమలు చేస్తున్నామని చెప్పారు. అదే సమయంలో విద్యార్థులను తల్లిదండ్రులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ 8 వేల మంది విద్యార్థులతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల దేశంలోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. 14 బీటెక్ కోర్సులను, 27 ఎంటెక్ కోర్సులను 17 విభాగాల ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ర్యాగింగ్ రహితంగా ఇంజినీరింగ్ కళాశాలను తీర్చిదిద్దామని వివరించారు. మెరుగైన ఉపాధి అవకాశాలతోపాటు, స్టార్టప్, విదేశాల్లో ఉన్నత విద్యకు తమ విద్యార్థులు వెళ్లడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

బాజీ జంక్షన్.. ట్రాఫిక్ టెన్షన్



బీఆర్‌టీఎస్ రోడ్డులో బాజీ జంక్షన్ వద్ద స్తంభించిన ట్రాఫిక్



బాజీ జంక్షన్‌లో ఇలా అడ్డదిడ్డంగా ప్రయాణం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ నుంచి పెందుర్తి వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిలో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్‌ఏడీ సెంటర్ నుంచి సింహాచలం రోడ్ వరకు ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతుంది. ప్రధానంగా బాజీ జంక్షన్ వద్ద సమస్య తీవ్రంగా ఉంటుంది. ఇక్కడ ఓ కానిస్టేబుల్‌ను విధుల్లో ఉంచినా ట్రాఫిక్ నియంత్రించడం సాధ్యం కావడంలేదు. పెందుర్తి వైపు వెళ్లే విద్యార్థులంతా ఇదే చోట ఉన్న బస్టాప్‌లో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉంటున్నారు. వందలాది మంది ఒకే చోట ఉండడంతో కొంతమంది రోడ్డుపైకి వచ్చి నిలుబడుతున్నారు. నాలుగు రహదారుల కూడలిలో కొంత మంది వాహనదారులు అడ్డదిడ్డంగా వాహనాలను ముందుకు తీసుకొస్తున్నారు. పెందుర్తి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ మీదకు వచ్చేందుకు ఇదో చోట సర్వీసు రోడ్డు నుంచి మధ్యమార్గంలోకి రావాల్సి ఉంటుంది. ఇక్కడే పాదచారులు రోడ్డు దాటాల్సి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు బాజీ జంక్షన్‌లో నెలకొన్న ట్రాఫిక్‌సమస్యపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపేలా తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



ఒకే కానిస్టేబుల్‌పై ట్రాఫిక్ నియంత్రణ భారమంతా



వాహనాల మధ్యలోంచే నడక సాగిస్తున్న ప్రయాణికులు

పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు చర్యలు

● వాల్తేర్ డివిజన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం



రైల్వే మహిళా గ్యాంగ్‌కు భద్రతపై అవగాహన కల్పిస్తున్న టీం సభ్యులు

తాటిచెట్లపాలెం: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులకు భద్రతతో కూడిన గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు వాల్తేర్ డివిజన్ సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రారంభించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీల నేతృత్వంలో ఈ బృందం సిబ్బందిపై లైంగిక వేధింపులు, హక్కులు, విధుల గురించి అవగాహన కల్పిస్తారు. ప్రతి ఉద్యోగికి ప్రత్యేకంగా మహిళా ఉద్యోగులకు ఎటువంటి భయం, ఆందోళన లేకుండా చేయడమే వాల్తేర్ డివిజన్ లక్ష్యమని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు నిబద్ధత గల కమిటీలు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇవి డివిజన్ పరిధిలోని ఆయా రైల్వే స్టేషన్లు, పని చేసే ప్రదేశాల్లో పర్యటించి మహిళా ఉద్యోగులకు వారి విధుల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై పలు కీలక సూత్రాలను తెలియజేస్తారన్నారు. ఈ బృంద సభ్యులు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ వేధింపుల సమయంలో ఎలా ఎదుర్కోవాలో వివరిస్తారని చెప్పారు. అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, ముఖాముఖి కార్యక్రమాలు వంటివి అన్ని విభాగాల్లోనూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. బాధితుల పక్షాన నిలబడి, ఫిర్యాదుల నమోదులో వారికి అవసరమైన సహాయం చేస్తారని తెలిపారు. తొలి రోజు పలు రైల్వే స్టేషన్లలో రైల్వే మహిళా గ్యాంగ్‌కు పని ప్రదేశాల్లో లైగింక వేధింపులను ఎదుర్కోవడంపై టీం సభ్యులు అవగాహన కల్పించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా జరిపారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. అలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడ సేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులందించారు.